Sakshi

Dt- 15/12/17

# మెట్రో జర్నీ భేష్

సాక్షి,సిటీబ్యూరో: ఎన్ఆర్ఐల బృందం గురువారం మెట్రో జర్నీ చేసింది. రసూల్‌పురా నుంచి అమీర్‌పేట్ వరకు మెట్రో రైలులో ప్రయాణించారు. ప్రపంచ స్థాయి మెట్రో వసతుల యాలను చూసి వారు ప్రశంసించారు. ఈ ప్రయాణం అద్భుతంగా ఉందన్నారు. భారతదేశం గురించి తెలుసుకోండి (నో ఇండియా ప్రోగ్రాం) కార్యక్రమంలో భాగంగా దక్షిణాఫ్రికా, గయానా, ఫిజీ, మారిషియస్, మలేషియా, మారిషస్, ఇజ్రాయెల్ తదితర 9 దేశాల నుంచి 40 మంది సభ్యుల బృందం నగరానికొచ్చింది. గురువారం రసూల్‌పురాలోని మెట్రోరైలు భవన్‌లో హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డితో భేటీ అయింది. వారు రసూల్‌పురా నుంచి అమీర్‌పేట్ వరకు మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ బృందంలో వీరంతా భారతీయ సంతతికి చెందిన 3వ లేదా 4 వ తరం వ్యక్తులే కావడం.. మొదటిసారిగా భారతదేశాన్ని సందర్శించడం విశేషం. ఈ సందర్భంగా వారికి హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టులో అమలుచేసిన నూతన సాంకేతిక విధానాలను ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వివరించారు. పీపీపీ విధానంలో చేపట్టిన అతిపెద్ద ప్రాజెక్టు ఇదేనని మెట్రో ఆర్థిక నమూనాను వివరించారు. భారతీయ నగరాల్లో భారీ పట్టణ మౌలిక వసతుల ప్రాజెక్టులను నిర్మించడంలో ఉన్న చిక్కులను వివరించారు. వినూత్నమైన ఇంజనీరింగ్, ఆర్థిక పరిష్కారాలతో అనేక సంక్లిష్ట సమస్యలను పరిష్కరించడంతోపాటు ప్రజల సహకారం ఎలా పొందామో వివరించారు. అత్యంత రద్దీగా ఉండే గ్రేటర్ నగరంలో మెట్రో నిర్మాణం, స్మార్ట్ టిక్కెటింగ్ ,సౌకర్యవంతమైన ప్రయాణం, కాలిబాటలు మరియు వీధి ఫర్నిచర్,సైకిల్ స్టేషన్లు, మినీబస్సులు, ఇలా మెట్రో ప్రాజెక్టులో భాగమైన అన్ని అంశాలను వారికి వివరించారు. వారి వెంట ఇతర ఉన్నతాధికారులున్నారు.

## మెట్రోలో నిత్యం 1.2 లక్షల మంది జర్నీ..!

మెట్రో ప్రారంభమై పక్షం రోజులు కాగా ..ప్రతీరోజూ సరాసరిన 1.2 లక్షలమంది మెట్రోజర్నీ చేస్తున్నట్లు మెట్రో అధికారులు తెలిపారు. శని, ఆదివారాల్లో రద్దీ 2 లక్షలకు చేరువవుతోందన్నారు. ఇప్పటివరకు సుమారు మూడు లక్షల స్మార్ట్‌కార్డులను విక్రయించామన్నారు. నాగోల్ -అమీర్‌పేట్, మియాపూర్-అమీర్‌పేట్ మార్గంలో ప్రస్తుతం 14 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయని..రైలు వేగాన్ని క్రమంగా పెంచుతుండడంతో ప్రయాణికుల ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందని మెట్రో అధికారులు తెలిపారు.



ఎన్వీఎస్‌రెడ్డితో భేటీ అయిన ఎన్ఆర్ఐ బృందం